నర్సరీకి కొత్తలుక్

- వీఎంఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీ సిద్ధం
- రూ.70 లక్షలతో ఆధునికీకరించిన ఇంజినీరింగ్ విభాగం
- ఆఫీస్ రూమ్, సేల్ పాయింట్, పంప్‌హౌస్ నిర్మాణం
- ఆహ్లాదకరంగా బనియన్ ట్రీ. డిస్ప్లే పాయింట్
- నేడు ప్రారంభించేందుకు సన్నాహాలు



ఆధునికీకరించిన సెంట్రల్ నర్సరీ ముఖద్వారం


రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన బ్రిక్‌వాల్స్


కొత్తలుక్‌తో నర్సరీ కార్యాలయ భవనం

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని వీఎంఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీ కొత్తలుక్ సంతరించుకుంది. దశాబ్దాలుగా నగర వాసులకు తక్కువ ధరలకే ఈ నర్సరీ ఇండోర్, అవుట్‌డోర్ ప్లాంట్స్‌ను అందిస్తోంది. డివిజినల్ ఫారెస్ట్ ఆఫీసర్ పర్యవేక్షణలో నర్సరీ సిబ్బంది ఇక్కడ పెద్ద ఎత్తున మొక్కలు అభివృద్ధి చేసి తక్కువ ధరలకే నగరవాసులకు విక్రయిస్తుంటారు. అయితే దశాబ్దాలుగా ఆధునికీకరణకు నోచుకొని ఈ నర్సరీకి ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ కొత్తలుక్ తీసుకొచ్చింది. రానున్న రోజుల్లో నగరాన్ని హరితవనంగా మార్చడంలో ఈ సెంట్రల్ నర్సరీ కీలక భూమిక పోషించాలనే సంకల్పంతో గత కొన్ని నెలలుగా ఆధునిక హంగులతో పూర్తిస్థాయిలో పనులు నిర్వహించారు. నర్సరీ కార్యాలయం, ఆకర్షణీయమైన బనియన్ ట్రీ, ఇండోర్ డిస్‌ప్లే పాయింట్‌లను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా ఆధునికీకరణ పనులు పూర్తి కావడంతో ఈ నెల 12 నుంచి ఈ సెంట్రల్ నర్సరీ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు

నర్సరీ అభివృద్ధి పనులను రూ.70 లక్షల వ్యయంతో వీఎంఆర్‌డీఏ చేపట్టింది. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా శిథిలావస్థకు చేరుకున్న కార్యాలయం స్థానంలో కొత్త కార్యాలయం, డిస్‌ప్లే పాయింట్, కొత్త ప్రధాన ద్వారం నిర్మించారు. దీంతోపాటు సేల్స్ పాయింట్, స్టోర్ రూమ్స్ కోసం కొత్త భవనాన్ని నిర్మించారు. నర్సరీ నీటి అవసరాలకు అనుగుణంగా కొత్తగా పంప్‌హౌస్ నిర్మించారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా పార్కింగ్ పాయింట్స్, నర్సరీలోని రోడ్లకు ఇరువైపులా బ్రిక్‌వాల్స్ నిర్మించారు. దీంతోపాటు వినియోగదారులు సేదతీరేందుకు బనియన్ ట్రీ పేరుతో ప్రత్యేక నిర్మాణం చేశారు.

> **నేటి నుంచి సేవలు పునఃప్రారంభం**
>
> వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఆదేశాల మేరకు నర్సరీని పూర్తిస్థాయిలో ఆధునికీకరించాం. నగరాన్ని హరితవనంగా మార్చడంలో ఈ నర్సరీ ప్రత్యేక భూమికి పోషించాలన్నదే కమిషనర్ ఆకాంక్ష. అందుకు అనుగుణంగా ఆధునికీకరణ పనులు నిర్వహించాం. కార్యాలయం, పంప్‌హౌస్, డిస్ప్లే పాయింట్, స్టోర్ రూమ్ భవనాలను కొత్తగా, ఆధునికంగా నిర్మించాం. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈ నెల 12న నర్సరీ సేవలు పునఃప్రారంభం కానున్నాయి. రహదారి నిర్మాణం త్వరలో చేపట్టాల్సి ఉంది.
>
> – శ్రీనివాసరెడ్డి, ఏఈ, వీఎంఆర్‌డీఏ


కొత్తగా నిర్మించిన బనియన్ ట్రీ ఆకృతి


ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ఇండోర్ మొక్కల డిస్ప్లేపాయింట్


పట్టు తప్పితే.. ప్రాణాలకే ముప్పు





ఆహ్లాదాన్ని పంచే సుందర సాగర తీరంలో ఒక్కోసారి అతిగా ప్రవర్తించి పట్టు తప్పితే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. అటువంటి దృశ్యాలే సాక్షి ఫొటోగ్రాఫర్‌కు చిక్కాయి. సహజంగా తీరంలో ఆటుపోట్ల సమయంలో, తుఫాన్లు వచ్చినప్పుడు భారీ రాళ్లు బయటకు కనిపిస్తుంటాయి. తీరం నుంచి కొద్ది దూరం వరకు ఉన్న ఈ భారీ బండరాళ్లు సముద్రం కాస్త వెనక్కి వెళ్లిన సందర్భంలో బయట పడుతుంటాయి. ఆ సమయంలో పర్యాటకులు, నగరవాసులు వీటిపై కూర్చుని ఫొటోలు తీసుకోవడం సర్వసాధారణంగా జరుగుతోంది. అదే సమయంలో నీటిలో నాని ఉండటం వల్ల రాళ్లపై నాచు చేరడంతోపాటు జారుడు స్వభావం కూడా కలిగి ఉంటాయి. చిన్నపాటి పట్టు తప్పినా ప్రమాదానికి గురవ్వాల్సిందే. ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అయినప్పటికీ చాలా మంది నగరవాసులు ఆ రాళ్లపైకి చేరి ఫొటోలు తీసుకుంటున్నారు. కొందరైతే చిన్నారులను సైతం తీసుకుని ప్రమాదకరమైన ఆ రాళ్లపై నడవడం కనిపిస్తోంది. అటువంటి ప్రమాదకర చేష్టలను మానుకోవాలని నగర పోలీసులు సూచిస్తున్నారు.

– ఏయూక్యాంపస్/ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్





ప్రమాదకర స్తంభం తొలగింపు


కొత్త స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డు పరిధి రామ్‌నగర్‌లో శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారైన విద్యుత్ స్తంభాన్ని గురువారం తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. ఈ సమస్యను స్థానిక ప్రజలు వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె విద్యుత్ శాఖ సిబ్బందితో మాట్లాడారు. స్పందించిన సిబ్బంది పాత స్తంభం తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గారావు పర్యవేక్షించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రామారావు

ఎంవీపీ కాలనీ : జిల్లాలోని పోస్ట్‌మెట్రిక్ స్థాయి విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్ మంజూరుపై జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో జరిగిన సమీక్షలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు పాల్గొని ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించిన కళాశాలల ప్రిన్సిపల్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్, సచివాలయాల కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 61 వేల మంది విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు అర్హులన్నారు. వివిధ కారణాల వల్ల సగానికిపైగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందలేదన్నారు. సచివాలయాల లాగిన్స్, ప్రిన్సిపల్ లాగిన్స్‌తోపాటు బయోమెట్రిక్ సమస్యలు కారణంగా ఆయా దశల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వీటిలో సచివాలయాల స్థాయిలో 20 వేలు, ప్రిన్సిపల్స్ స్థాయిలో 3,850, బయోమెట్రిక్, ఇతర సమస్యలతో 11,950 వేల అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఆయా దరఖాస్తులను త్వరితగతిన ప్రోసెస్ చేయాలని సూచించారు. అవసరమైన 5 స్టెప్స్ వెరిఫికేషన్స్‌పై మరోసారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

మధురవాడ: నగరంపాలేనికి చెందిన నాగోతి శివ అనే యువకుడిపై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై పీఎం పాలెం పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మిథిలాపురి వుడా కాలనీలోని రోడ్డులో ఓ దుకాణం వద్ద డబ్బుల వ్యవహారంలో తలెత్తిన వివాదంలో మధురవాడకు చెందిన చందు, బాలు అనే ఇద్దరు వ్యక్తులు బుధవారం దాడి చేసినట్లు పీఎంపాలెం పోలీసులకు శివ ఫిర్యాదు ఇచ్చాడు. శివ చికిత్స నిమిత్తం గాయత్రి ఆస్పత్రిలో చేరాడు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కరరావు తెలిపారు.

మద్దిలపాలెంలో అన్నసమారాధన

మద్దిలపాలెం : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో గురువారం శ్రీ సాయినాథ యూత్ అసోసియేషన్ యువకులు అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శి పులగం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి గుడ్ల గణేష్ రెడ్డి, వార్డు సోషల్ మీడియా అధ్యక్షుడు నగిరెడ్ల పోలిశెట్టి, జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు పులగం కొండారెడ్డి, తూర్పు సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పిలక మధుసూదన రెడ్డి, ఎరుసు అరుణ, గుదే శ్రీను, గుమ్మడి మణి, 16 వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మీసాల ప్రదీప్, చింతా వెంకటరావు, కమల్, అబ్బాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు

రామాలయంలో నారాయణ సేవ

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి వెర్నిదుర్గానగర్ రామాలయం ఆవరణలో గురువారం నారాయణ సేవ నిర్వహించారు. ఆలయ ఆవరణలోని భక్తులకు అన్నాసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, స్థానికులు బాలరాజు, కిరణ్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన కారు


ప్రమాదంలో ముందుభాగం నుజ్జయిన కారు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. సాగర్‌నగర్ మొగదారమ్మ ఆలయం సమీపంలో గురువారం మధ్యాహ్నం కారు అదుపు తప్పి డివైడర్ పైకి ఎక్కింది. నగరం నుంచి రుషికొండ వైపు అతి వేగంగా దూసుకుని వస్తున్న కారు, ఒక్కసారిగా అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా.. డివైడర్, డివైడర్ పై గ్రిల్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. కారులో నలుగురు వ్యక్తులు ఉండగా అదృష్టవశాత్తు ఏమీ కాలేదు.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రవేశాలకు ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. కళాశాలలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోపు 81797 80917 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సిటీ బస్‌లో టికెట్ల బురిడీ

- దిగాల్సిన చోటు కంటే దూరంగా ఉన్న స్టేజికి టికెట్లు కొడుతున్న కండక్టర్
- ఆదర్శనగర్‌లో నిలదీసిన మహిళా ప్రయాణికులు, స్థానికులు



ఆదర్శనగర్‌లో సిటీ బస్‌ను నిలిపేసి కండక్టర్, డ్రైవర్‌ను నిలదీస్తున్న ప్రయాణికులు, స్థానికులు

ఆరిలోవ : సిటీ బస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణం ఆర్టీసీ సొమ్ము చేసుకుంటోందని, ఆర్టీసీ అధికారులు ప్రభుత్వాన్ని బురిడీ కొట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో ఓ సిటీ బస్‌లో గురువారం సాయంత్రం బయటపడిన టికెట్ల వ్యవహారమే దీనికి నిదర్శనం. పాత పోస్టాఫీస్ నుంచి వస్తున్న వాల్తేరు డిపోకి చెందిన 52 డి సిటీ బస్ పాత డెయిరీఫారం దరి రవీంద్రనగర్ వరకు తిరుగుతుంది. ఈ బస్‌లో ఎక్కిన మహిళలకు ఉచిత టికెట్లు కొట్టిన కండక్టర్ వ్యవహారంపై కొందరు మహిళలు నిలదీశారు. ఆ కండక్టర్ బస్ ఎక్కిన మహిళలకు దిగాల్సిన స్టేజి కంటే దూరంగా ఉన్న స్టేజులకు టికెట్లు కొట్టడం గమనించారు. ఇసుకతోట, వెంకోజీపాలెంలో దిగిన మహిళలకు ఆదర్శనగర్, రవీంద్రనగర్ ఆఖరి బస్టాప్‌కు టికెట్లు కొట్టారు. దీన్ని గమనించిన బస్‌లోని కొందరు మహిళలు ఆ కండక్టర్‌ను నిలదీశారు. అంతటితో ఆగకుండా ఆదర్శనగర్ మధ్యలో స్థానికుల సహాయంతో బస్‌ను నిలిపేశారు. అక్కడ కండక్టర్, డ్రైవర్‌ను మహిళలు, స్థానికులు నిలదీశారు. ఎందుకిలా చేస్తున్నారని వాల్తేరు డిపో మేనేజర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దానికి ఆ మేనేజర్ స్పందించి ఇక నుంచి అలా జరగకుండా చూస్తామని స్థానికులకు సర్దిచెప్పారు. అయితే ఉన్నతాధికారులు చెప్పకుండా కండక్టర్ అంత ధైర్యంగా ఇలా చేయబోరని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆర్టీసీకి దొడ్డిదారిని ఆదాయం కోసం ఇలా తప్పుడు టికెట్లు కొడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.


క్లుప్తంగా

కంబాలకొండలో పర్ణశాల


కంబాలకొండలో కర్రలు, గడ్డితో సుందరంగా నిర్మించిన పర్ణశాల

ఆరిలోవ : పర్యాటక కేంద్రం కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో అటవీశాఖ అధికారులు సందర్శకుల కోసం ఇటీవల ఓ పర్ణశాల నిర్మించారు. కంబాలకొండ లోపల పిక్నిక్ స్పాట్ పక్కన ప్రత్యేకంగా ఉద్యానవనం తయారు చేశారు. అందులో కర్రలు, గడ్డితో పర్ణశాల నిర్మించారు. దాని చుట్టూ రావి, మర్రి, వేప, నేరేడు, టేకు, బాదం, కానుగ, తురాయి తదితర మొక్కలు నాటించారు. ఈ పర్ణశాలకు రెండు వైపులా మెట్ల మార్గం ఏర్పాటు చేశారు. దానిపై 10 మంది గడిపేలా కర్రలతో ప్లాట్‌ఫాం సిద్ధం చేశారు. అంతకంటే ఎక్కువ మంది దానిపైకి చేరితే బలహీనపడుతుందనే సూచీ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇది ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన ప్రాంతం కావడంతో పిక్నిక్‌లు జరుపుకోవడానికి అనువుగా ఉంటుందని కంబాలకొండ సిబ్బంది అంటున్నారు.

డ్రైనేజీ పొంగడంతో దుర్వాసన


రోడ్డుపై నిలిచిన డ్రైనేజీ నీరు

బీచ్‌రోడ్డు : సిరిపురం హెచ్‌పీసీఎల్ బంకు సర్కిల్ వద్ద అండర్ గ్రాండ్ డ్రైనేజీ బ్లాక్ అయ్యి నీరు రోడ్డు మీదకు పొంగి ప్రవహించింది. దీంతో ఆ సర్కిల్ మొత్తం డ్రైనేజీ నీరు ప్రవహించడంతో వాహనదారులు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటు నుంచి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీవీఎంసీ సిబ్బంది తక్షణమే ఈ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 21వ వార్డులో అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. వార్డులోని రోడ్లు, డ్రైన్లు, కాలువలను రూ.1.82 కోట్లతో నిర్మించే పనులను ప్రారంభించారు. వీలైనంత వేగంగా, నాణ్యతతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ మోసాలు


దారపాలెంలో కిరాణా షాపు యజమానికి కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డు పరిధి దారపాలెంలో పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, స్థానిక నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలపై ముద్రించిన కరత్రాలు అందజేశారు. వ్యాపారులు, యువకులు, వృద్ధులను కలిసి కూటమి పాలనలో ప్రజలకు ఎదురవుతున్న మోసాలు వివరించారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పాలనను ప్రజలంతా గమనించాలని, ఎన్నికల సమయంలో ఓటుతో కూటమి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకుడు శ్రీనివాస్, స్థానిక నాయకులు మారిక భాస్కరరావు, పాండ్రంకి శ్రీనివాస్, వంకర బాబూరావు, కాకర గోవింద్, ప్రసంగి వాసు, రాము, సురేష్, బంగార్రాజు, శ్రీనివాస్, కృష్ణంరాజు, రామారావు పాల్గొన్నారు.

నగరంలో పారిశుధ్యం మెరుగుకు కృషి

- ఉదయం 6 నుంచే అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండాలి
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- జోన్–3, 4ల్లో క్షేత్ర పర్యటన


రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించి నిర్వహిస్తున్న కూరగాయల దుకాణాన్ని తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: ప్రజారోగ్యం దృష్ట్యా నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్–3, 4 జోనల్ కార్యాలయ పరిధిలోని 19, 20, 30 వార్డుల్లో ఆయన పర్యటించారు. ముందుగా జోన్–4 పరిధి 30వ వార్డు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల హాజరును ఫోన్‌లో పరిశీలించారు. వ్యర్థాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయని, విధుల్లో అలసత్వం వహించరాదని వారికి సూచించారు. ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని జోన్ల కమిషనర్లను వాకీటాకీ ద్వారా ఆదేశించారు.

వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం

అనంతరం జోన్–3 పరిధి ఉషోదయ జంక్షన్ నుంచి రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వరకు కమిషనర్ పర్యటించారు. డ్రోన్ ద్వారా ఆయన పరిశీలించగా వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ అధికంగా కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించి కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి దుకాణం తొలగించి, ప్రతి జోన్‌లో ఏర్పాటు చేస్తున్న వెండింగ్ జోన్‌లో వారికి ఒక దుకాణం కేటాయించాలే చూడాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ఉషోదయ జంక్షన్‌లోని ఫ్రీ లెఫ్ట్‌లో ఆక్రమణలో ఉన్న బడ్డీలు వెంటనే తొలగించి, ఆ చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం కల్పించాలని, కూడలిలో వాహనాల రాకపోకలకు ఫ్రీ లెఫ్ట్‌లో 50 మీటర్ల వరకు ఆక్రమణలు లేకుండా చూడాలని ఆదేశించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న భవనాల యజమానులు నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించాలని జెడ్సీకి సూచించారు. నిత్యం అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. పర్యటనలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఒ.బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను పరిశుభ్రంగా ఉంచాలి


ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మాధవీలత, తదితరులు

ఎంవీపీ కాలనీ : రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సీఈవో మాధవి లత గురువారం ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను పరిశీలించారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆమె ఉదయం రైతు బజార్‌ను సందర్శించి కర్నూల్ ఉల్లిపాయలు విక్రయిస్తున్న డ్వాక్రా రైతులతో మాట్లాడారు. ఉల్లిపాయల నాణ్యతను పరిశీలించడంతోపాటు విక్రయాల్లో రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు అందించే సేవల్లో పారదర్శకంగా వ్యవహరించాలని, స్టాల్స్‌తో పాటు రైతు బజార్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రైతు బజార్‌లో ఇటీవల చేపట్టిన ఇంజినీరింగ్ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగ అధికారులకు పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కిరణ్, రైతు బజార్ ఈవో వరహాలు, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుత్, రాంబాబు

బీచ్‌రోడ్డు: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుత్, వై.రాంబాబు ధ్వజమెత్తారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం జరగాల్సిన అవసరముందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లే, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అదే దారిలో నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, వైద్య రంగాలను పూర్తిగా ప్రైవేటుపరం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటక రంగంలో రూ.10 వేల కోట్ల విలువైన 22 హోటళ్లు, రిసార్ట్‌లు, ఆస్తులను ప్రైవేట్‌పరం చేయడం దారుణమన్నారు. తాజాగా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణకు అప్పగించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయని వివరించారు. విజయవాడ గవర్నరుపేట ఆర్టీసీ డిపోతోపాటు, విశాఖలోని ఆర్టీసీ స్థలాలను లూలూ సంస్థకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయం కూడా ఇదే కోవలోదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పాఠశాలల నుంచి ఇంటర్, ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేటు మయమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విద్య అంటే వీఐటీ, ఎస్ఆర్ఎం, కేఎల్యూ, గీతం వంటి ప్రైవేట్ యూనివర్సిటీల పేర్లే వినిపిస్తున్నాయని, ఇంటర్ విద్య అంటే నారాయణ, చైతన్య కళాశాలలే గుర్తుకొస్తున్నా యని ఎద్దేవా చేశారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్‌ను నియమించినప్పటికీ ఫలితం లేదని, మొత్తం విద్యా, వైద్య రంగాలను ప్రైవేట్‌కు అప్పగించడం తగదని వ్యాఖ్యానించారు. మధురెడ్డి, భీమరాజు పాల్గొన్నారు.